GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 257 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | సోమవారం 17-03-2025 | పేజీలు : 4



## వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో అగ్నిప్రమాదం

### - పూర్తిగా కాలిపోయిన రికార్డులు

**టీ మీడియా,మార్చి16,ఉరవకొండ :** అనంతపురం జిల్లా ఉరవకొండ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. కార్యాలయం వెనక చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. కార్యాలయానికి మంటలు అంటుకోవడంతో రికార్డులు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఇక్కడికి చేరుకున్న అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారు. అప్పటికే రికార్డులు, ఫర్నిచర్ మంటలతో పూర్తిగా కాలిపోయాయి.

# కేసీఆర్ పాపాల చిట్టా విప్పుతా

## కాళేశ్వరం కూలేశ్వరం అయ్యింది



- అసలు సినిమా ముందుంది
- ఇది ఇంటర్వెల్ మాత్రమే
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**టి మీడియా, మార్చి 16, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రతినిధి :** గ్రూప్-1, 2, 3 పరీక్షలను సవ్యంగా నిర్వహించి ఉద్యోగాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించే కృషి చేస్తున్నామని అన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను కేసీఆర్ దివాళా తీయించారని విమర్శించారు. ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని, తెలంగాణ రాష్ట్రానికి కడియం అవసరం ఉందని చెప్పి పార్టీలోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం త్వరలోనే పూర్తి కానుందని తెలిపారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో ఇప్పటి వరకు చెప్పింది ఇంటర్వెల్ మాత్రమే.. మిగతా సినిమా తర్వాత చూపిస్తా అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మామునూరు ఎయిర్‌పోర్ట్ తీసుకొచ్చామన్నారు సీఎం రేవంత్. వరంగల్ అభివృద్ధి కోసం రూ.6 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ప్రకటించారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. పదేళ్లలో కేసీఆర్ 7లక్షల కోట్ల అప్పులు చేశారని వారు చేసిన అప్పులలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష 53 వేల కోట్లు చెల్లించిందని వివరించారు. కేసీఆర్ లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలోనే కూలిపోయిందని, అది కాళేశ్వరం కాదు కూలేశ్వరం అని ఎద్దేవా చేశారు

### కాళేశ్వరం కూలేశ్వరం అయ్యింది

గత పదేళ్లలో రూ.1.81 లక్షల కోట్లను ప్రాజెక్టుల పేరు మీద కేసీఆర్ ఖర్చు పెట్టారని, ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలిపోయి కూలేశ్వరం అయ్యిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులే ఈనాటికి నీళ్లు అందిస్తున్నాయని






అన్నారు. శ్రీరామ్‌సాగర్, నాగార్జునసాగర్, కోయిల్‌సాగర్, ఇందిరాసాగర్ నిర్మించింది ఎవరని ప్రశ్నించారు.

### విధులకు వెళ్లకుంటే ఎవరికైనా జీతం వస్తుందా?

ఎమ్మెల్యేగా జీతభత్యాలు తీసకుంటున్న వ్యక్తి తన బాధ్యతలు నెరవేర్చటం లేదని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. 15 నెలలుగా రూ.16 లక్షల జీతభత్యాలు తీసుకున్న వ్యక్తి అసెంబ్లీకి మాత్రం రావట్లేదని, ప్రజల సొమ్మును జీతభత్యాలుగా తీసుకునే వ్యక్తి ప్రజల కోసం అసెంబ్లీలో సూచనలు ఎందుకు చేయటం లేదని, ఉద్యోగం చేయకుంటే, విధులకు వెళ్లకుంటే ఎవరికైనా జీతం వస్తుందా, తన అనుభవాన్ని ప్రజల కోసం ఎందుకు ఉపయోగించటం లేదని అని ప్రశ్నించారు.

### జాతిపిత ఎలా అవుతారు?

ఈ ప్రభుత్వం వచ్చాకే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్‌కు రింగ్‌రోడ్డు వచ్చాయని గుర్తు చేశారు. జయశంకర్ సర్ స్వగ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా చేసింది ఈ ప్రభుత్వమేని అన్నారు. మహిళలకు వెయ్యి బస్సులు ఇచ్చి ఆర్టీసీలో అద్దెలకు తీసుకున్నామని, మహిళల చేత వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయించామని తెలిపారు. తెలంగాణ కోసం సర్వం ధారపోసిన వాళ్లు తెలంగాణ జాతిపిత అవుతారని, ప్రజల సొమ్ము దోచుకుని ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న వాళ్లు జాతిపిత ఎలా అవుతారని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము దోచుకుని పేపర్, టీవీ ఛానెళ్లు పెట్టుకున్న వ్యక్తి జాతిపిత ఎలా అవుతారని ప్రశ్నించారు.

### కేసీఆర్ పాపాలచిట్టాను విప్పుతాను

కేసీఆర్ చేసిన తప్పులకు ఒక్క ఏడాదిలోనే ఈ ప్రభుత్వం రూ.1.53 లక్షల కోట్లు వడ్డీలుగా కట్టిందని, ఏడాదిలోనే రూ.84 వేల కోట్లు వడ్డీలకు, రూ.64 వేల కోట్లు అసలు కింద చెల్లించామని అన్నారు. పదేళ్లు పాలించిన వ్యక్తి ఏడాదికే మమ్మల్ని దిగిపోమ్మని అంటున్నారని, ఐదేళ్ల కాలానికి ప్రజలు తీర్పు ఇచ్చి మమ్మల్ని పదవిలో కూర్చోబెట్టారని అన్నారు. కేసీఆర్ పాపాలచిట్టాను మున్ముందు కూడా విప్పుతానని వెల్లడించారు.గత పదేళ్లలో రూ.1.81 లక్షల కోట్లను ప్రాజెక్టుల పేరు మీద కేసీఆర్ ఖర్చు పెట్టారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలిపోయి కూలేశ్వరం అయ్యింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులే ఈనాటికి నీళు ల్ల అందిస్తున్నాయి. శ్రీరామ్‌సాగర్, నాగార్జునసాగర్, కోయిల్‌సాగర్, ఇందిరాసాగర్ నిర్మించింది ఎవరు?"- రేవంత్ రెడ్డి, సీఎం

### అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

బహిరంగ సభకు ముందు స్టేషన్‌ఘన్‌పూర్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి, రూ.46కోట్లతో 100 పడకల అస్పత్రి నిర్మాణానికి, రూ.26కోట్లతో ఇంటిగ్రేటెడ్ డివిజినల్ ఆఫీస్ కాంప్లెక్స్‌కు, రూ.38కోట్లతో పంచాయతీ రాజ్ బీటీ రోడ్ల నిర్మాణానికి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.5 కోట్లతో డిగ్రీ కళాశాల నిర్మాణానికి, మారుమూల తండాలకు రోడ్లు, బంజారా భవన నిర్మాణానికి శంకుస్థాపన రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మహిళా శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులు, బ్యాంక్ లింకేజ్ లోన్‌లు సీఎం ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 5సబ్ స్టేషన్లు, డివిజన్ ఆఫీసు నిర్మాణానికి, 5వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

# నేటి నుంచే 'రైసినా డైలాగ్'

- 125 దేశాల నుంచి మందికిపైగా ప్రతినిధులు
- ప్రారంభించనున్న ప్రధాని మోదీల

**టీ మీడియా,మార్చి16,న్యూఢిల్లీబ్యూరో:** భారత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'రైసినా డైలాగ్' సదస్సును ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం దిల్లీలో ప్రారంభించనున్నారు. దీనిలో 125 దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును భారత విదేశాంగ శాఖ సంయుక్త భాగస్వామ్యంతో అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఓఆర్?ఎఫ్?) నిర్వహిస్తోంది. ప్రపంచ రాజకీయ, ఆర్థిక అంశాలపై చర్చకు వేదికగా రైసినా డైలాగ్ సదస్సు నిలువనుంది. 'కాల చక్ర - ప్రజలు, శాంతి, భూగ్రహం' అనే థీమ్‌తో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. పదోసారి జరగబోతున్న ఈ సదస్సులో పాల్గొనే ప్రముఖుల జాబితాలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సాన్, అమెరికా జాతీయ నిఘా విభాగం డైరెక్టర్ తులసీ గబార్డ్, ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహా తదితరులు ఉన్నారు. ఈ సదస్సులో న్యూజిలాండ్ ప్రధాని కీలకోపన్యాసం చేయనున్నారు. రష్యా - ఉక్రెయిన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమయ్యారు. ఈ తరుణంలో భారత్‌కు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి వస్తుండటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

### తైవాన్ నుంచి సైతం



మునుపెన్నడూ లేని రీతిలో భారత్-తైవాన్ సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. ఈక్రమంలో తైవాన్‌కు చెందిన ఓ సీనియర్ భద్రతా అధికారి సారథ్యంలోని టీమ్ కూడా 'రైసినా డైలాగ్' సదస్సుకు విచ్చేయనుంది. 125 దేశాలకు చెందిన మంత్రులు, మాజీ ప్రభుత్వాధినేతలు, మిలిటరీ కమాండర్లు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, విదేశాంగ వ్యవహారాల పరిశీలకులు సహా దాదాపు 3,500 మందికిపైగా ఇందులో పాల్గొని కీలక అంశాలను చర్చించబోతున్నారు. దాదాపు 20 దేశాల విదేశాంగ మంత్రులు 'రైసినా డైలాగ్'లో పాల్గొంటారని సమాచారం. స్లోవేనియా, లగ్జంబర్గ్, లీచ్ టెన్‌స్టీన్, లాత్వియా, మాల్డోవా, జార్జియా, స్వీడన్, స్లోవక్ రిపబ్లిక్, భూటాన్, మాల్దీవ్స్, నార్వే, థాయ్‌లాండ్, ఆంటిగ్వా, బార్బుడా, పెరూ, ఘనా, హంగరీ, మారిషస్ దేశాల విదేశాంగ మంత్రులు సదస్సుకు హాజరు కానున్నారు. క్యూబా డిప్యూటీ ప్రధానమంత్రి మార్టినెజ్ డియాజ్, ఫిలిప్పీన్స్ విదేశాంగ శాఖ మంత్రి ఎన్రిక్ ఎ.మనాలో సైతం దిల్లీకి వస్తున్నారు.

### ఆరు అంశాలపై ప్రధాన చర్చ

'రైసినా డైలాగ్' సదస్సులో ప్రధానంగా 6 అంశాలపై మూడు రోజుల పాటు సమగ్రంగా చర్చించనున్నారు.అంతర్జాతీయ సమాజంలో రాజకీయ అవాంతరాలు, సవాళ్లపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ మార్పులను ఎలా తట్టుకోవాలనే దానిపై చర్చ జరగనుంది.ఆర్థిక, వాణిజ్య, రాజకీయపరమైన వ్యవహారాల్లో ప్రతిష్ఠంభన తొలగాలంటే, ఎవరు? ఎక్కడ? ఎలా? అనే మూడు అంశాలపై ప్రపంచ దేశాలు స్పష్టతకు రావాలి. ఈ దిశగా చర్చలు జరగనున్నాయి.డిజిటల్ యుగం. ప్రపంచ దేశాల నిఘా సంస్థలు, దర్యాప్తు సంస్థలు, వాటి ఉన్నతాధికారులు డిజిటల్‌గా సమన్వయం చేసుకునేలా వ్యవస్థల ఏర్పాటుపై చర్చ జరగనుంది.ఉగ్రవాదం కట్టడిపై చర్చించనున్నారు. దీనిపై కలిసికట్టుగా పనిచేసేందుకు సరైన వ్యూహాలను సిద్ధం చేయనున్నారు.ప్రగతి పయనంలో కలిసికట్టుగా నడవాలనే భావనపై వివిధ దేశాల ప్రతినిధులు చర్చించనున్నారు. ఇందుకోసం కొత్త ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు.ప్రపంచ శాంతిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించే అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఇందుకు దోహదపడే సంస్థలు, ప్రతినిధులకు ప్రోత్సాహం, వారిని సమన్వయం చేయడంపై దృష్టి పెడతారు

# 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం

### -సీఎం చంద్రబాబు



**టీ మీడియా,మార్చి16ఉండవల్లి :** పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఈ ఉగాది నుంచి పీ4 విధానాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. తెలుగుజాతి కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ 10 మంది తెలుగు వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతిలో 58 అడుగల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తామన్న సీఎం అమరజీవి నివాసాన్ని మ్యూజియంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. 12 నెలలు 12 కార్యక్రమాలతో పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో 2047 నాటికి రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తామని, శ్రీ పొట్టి శ్రీరాములు స్వగ్రామంలో ఆధునిక వసతులతో ఆరోగ్య కేంద్రం, హైస్కూల్ నిర్మిస్తామని సీఎం చెప్పారు. ఉండవల్లి నివాసంలో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వచ్చే పొట్టి శ్రీరాములు జయంతి నాటికి 58 అడుగుల ఎత్తుతో విగ్రహ నిర్మాణం పూర్తిచేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అమరావతిలోనే మెమోరియల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు బకింగ్ హామ్ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జనం కోసం, తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు బతికారని సీఎం కొనియాడారు. పొట్టిశ్రీరాములు చేసిన త్యాగ ఫలితమే భాషా ప్రాయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది అని గుర్తు చేశారు.పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో పీ4 విధానం: ఏ భాష మాట్లాడేవారిని ఆ భాష వారే పాలించుకునే అవకాశం రావాలని పొట్టి శ్రీరాములు కోరుకున్నారన్న సీఎం తెలుగు భాష మాట్లాడేవారికి ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావాలని పోరాడి ఆత్మార్పణ చేశారని కొనియాడారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో చేపట్టే పీ4 విధానాన్ని జయప్రదం చేస్తే సమజాంలో సుస్థిరత ఉంటుందని చంద్రబాబు అన్నారు. రాబోయే 5 ఏళ్లలో పేదరిక నిర్మూలనకు ప్రతి వ్యక్తి జీవన ప్రమాణాలను పెంచేందుకు ఇబ్బందిలేకుండా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.పొట్టి శ్రీరాములు చనిపోయిన తర్వాత ప్రజల్లో ఆగ్రహావేశాలు రేకెత్తాక ప్రత్యేక రాష్ట్రం ఇస్తున్నామని 1952 డిసెంబర్ 19న పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటించిందని సీఎం గుర్తు చేశారు. 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయనున్నట్లు ఆ ఏడాది మార్చి 25న నాటి ప్రధాని నెహ్రూ ప్రకటించారని అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం స్వపరిపాలనలోకి వచ్చిందన్నారు. తర్వాత తెలంగాణలో కలిసిపోవడం, మళ్లీ 2014లో రెండు రాష్ట్రాలుగా విడిపోడం జరిగిపోయిందన్నారు. అందుకే ఆయన ఆత్మబలిదానంను డిసెంబర్ 15ను ఘనంగా నిర్వహించామని సీఎం తెలిపారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను గుర్తు చేసేలా ట్రస్ట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన అభిమానులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి దొంగ

### -సీసీ టీవీలో అంతా రికార్డ్





**టి మీడియా, మార్చి 16, హైదరాబాద్ బ్యూరో:** చొరబడడం, దోచుకోవడం సర్వత్రా మామూలు విషయమే.. కానీ, అదే దొంగలు ఓ పేరున్న ప్రజాప్రతినిధి ఇంట్లో చొరబడితే..? కట్టుదిట్టమైన భద్రత మధ్య, అడుగడుగునా సెక్యూరిటీ బలగాల మధ్య ఉండే బడా నేతల ఇళ్లకే దొంగల బెడద అంటే ఇక సామాన్య జనం పరిస్థితి చెప్పేది ఏముంది? ఇంతకీ అసలేం జరిగింది. ఆ ప్రజాప్రతినిధి ఎవరా అని ఆశ్చర్యపోతున్నారా? బీజేపీ ఎంపీ డీకే అరుణ ఇంట్లో తాజాగా దొంగలు హల్‌చల్ చేశారు. హైదరాబాద్ నగరం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఉండే ఎంపీ డీకే అరుణ ఇంట్లో దొంగలు చొరబడడం ఇప్పుడు రాష్ట్రమంతా చర్చనీయాంశమైంది. అర్ధరాత్రి బీజేపీ ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి ఓ దుండగుడు చొరబడినట్లుగా సమాచారం. ఆ దొంగ దాదాపు గంటన్నర పాటు డీకే అరుణ ఇంటి కిచెన్‌లోనే ఉన్నట్లు తెలిసింది. అంతటితో ఊరుకోకుండా కిచెన్‌లో ఉన్న సీసీ కెమెరాని కూడా ఆ దొంగ కట్ చేశాడట. ఆ దుండగుడు డీకే అరుణ ఇంట్లో దాదాపు రెండు గంటల పాటు గడిపినట్లు తెలుస్తోంది. బడా నేత ఇంటికే వచ్చి ఇలా ప్రవర్తించడం వల్ల రేపు ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆ దొంగ కనీసం ఊహించి కూడా ఉండడా అంటున్నారు పలువురు.ఈ విషయంపై డీకే అరుణ వాచ్ మెన్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ముసుగు, గ్లౌజులు ధరించి ఆ దొంగ ఇంట్లోకి చొరబడి కిచెన్, హాలు సీసీ కెమెరాలు ఆఫ్ చేసినట్లు వాచ్ మెన్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే.. దుండగుడు వచ్చిన సమయంలో డీకే అరుణ ఇంట్లో లేరట. ఇప్పటివరకు ఆ దుండగుడి గురించి సమాచారం లభించలేదు. జూబ్లీహిల్స్ పీఎస్‌గా ఈ ఘటనపై కేసు నమోదైంది. ఇదిలా ఉండగా.. ఈ ఘటనపై ఎంపీ డీకే అరుణ స్పందిస్తూ.. ఇందులో కచ్చితంగా కుట్రకోణం దాగి ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు తనకు భద్రత పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

# అమెరికా నుంచి అమ్మ రాగానే పెళ్లి

### - నాలుగు రాష్ట్రాల్లో 24 కేసులు

**టి మీడియా, మార్చి 16, హైదరాబాద్ బ్యూరో:** తప్పుడు సమాచారంతో మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల వేదికగా వివాహం చేసుకుంటానంటూ తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడుల్లో పలువురు యువతుల నుంచి పెద్ద ఎత్తున డబ్బు కాజేసిన మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడుల్లో 24 కేసులున్నాయి. రెండు సార్లు జైలుకు వెళ్లి వచ్చినా తీరు మార్చుకోకుండా మోసాలకు పాల్పడి మళ్లీ కటకటాలపాలయ్యాడు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, డీఐ మధుసూదన్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం,

### బెంగళూరులో అరెస్టు

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన జోగాడ వంశీకృష్ణ అలియాస్ హర్ష చెరుకూరి(33) పలు మ్యాట్రిమోనీ వెబ్సైట్లలో యూనాంకు చెందిన ఎమ్మెల్యే ఫొటోతో వివరాలు నమోదు చేసి తాను ఎన్నారై, వ్యాపారి, ఐటీ ఉద్యోగిని అంటూ రెండో వివాహం కోసం చూస్తున్న వారు, మూడు పదుల

మిగతా 4లో..

# క్రీడాభివృద్ధిలో వనపర్తికి జాతీయ గుర్తింపు

- త్వరలోనే వనపర్తి జిల్లా కేంద్రాన్ని క్రీడా హబ్బుగా ఏర్పాటు
- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి



**టీ మీడియా, మార్చి 16, బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రం డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అండర్ 14 ఫుట్బాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారిస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చునని, క్రీడాకారులందరూ గెలుపు ఓటములను స్ఫూర్తిదాయకంగా తీసుకొని ముందుకెళ్లాలని వారు సూచించారు. వనపర్తిలో రూ 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేయను న్నామని,దీంతో విద్యార్థులకు మూడవ తరగతి నుంచి పీజీ వరకు ఉన్నత విద్య అందించవచ్చునని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35 అడ్వాన్స్డ్ ఐటీఐ ఇనిస్ట్యూట్లను ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా క్రీడాకారులకు తగు శిక్షణ ఇచ్చి తయారుచేయునట్లు వారు పేర్కొన్నారు. త్వరలోనే వనపర్తిలో ఫుట్బాల్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. వనపర్తికి రాష్ట్ర స్థాయిలోనే క్రీడాపర్తిగా గుర్తింపు వచ్చే విధంగా ఇక్కడ 50 గదులతో వసతి గృహాన్ని సైతం నిర్మిస్తామని వారు తెలిపారు. అండర్ 14 బాల, బాలికలకు నిర్వహించిన ఈ క్రీడల్లో 20 బాలికల జట్లు, 20 బాలుర జట్లు పాల్గొన్నట్లు వారూ పేర్కొన్నారు. ఇందులో బాలికల్లో నిజామాబాద్ జిల్లాకు మొదటి స్థానం, ఆదిలాబాద్ జిల్లాకు రెండవ స్థానం,రంగారెడ్డి జిల్లాకు మూడో స్థానం లభించింది. బాలుర జట్లలో మొదటి స్థానంలో హైదరాబాద్,రెండవ స్థానంలో మహబూబ్నగర్, మూడవ స్థానంలో రంగారెడ్డి జట్లు ప్రతిభ కనబరిచాయి. వారికి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, జిల్లా క్రీడా శాఖ అధికారులు సుధీర్ కుమార్ రెడ్డి, సురేందర్ రెడ్డి, క్రీడాకారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

**టీ మీడియా, మార్చి 16, మేడ్చల్:**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్టలో గల శ్రీనివాస్ నగర్ చౌరస్తాలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని అవమానించిన జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను టిపిసిసి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి , మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ , కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ హనుమంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రోజు దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగినది. ఈ సందర్భంగా పున్నా రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ నాయకులకి హెచ్చరిక చేస్తున్నాం రాబోయే రోజుల్లో ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు మా ముఖ్యమంత్రి పైన గానీ ,మంత్రులపై గానీ, ఎమ్మెల్యేలపై గానీ కాంగ్రెస్ పార్టీ నాయకులపై గానీ చేసిన చూస్తూ ఊరుకోమని తగిన గుణపాఠం చెప్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రషీద్ బేగ్, దండే రాజు, అబేద్, పవన్ ,మరలింగ , జలీల్ , శ్రీనివాస్ గౌడ్ , ముఖేష్ అంజద్ హర్భజన తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యాలకు కళ్యాణ మండపాలు

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**టి మీడియా, మార్చి16, మేడ్చల్:**



చింతల్ డివిజన్ 128 లోని "పాత చింతల్ బస్తీ" లో హిందూ టెంపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కాశీనాధ కళ్యాణ మంటపాన్ని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె వి . వి వే కా న ం ద్ ప్రారంభించారు. ఈ సంధర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలు శుభకార్యాలు నిర్వహించుకోవడంలో కళ్యాణ మండపాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. అంతకుముందు పక్కనే గల వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్, మహమ్మద్ రషీదా రఫిక్, ఓల్డ్ చింతల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి, సభ్యులు దేగల రాము, మురళీ, రాధాకృష్ణ రెడ్డి, చంద్రానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ రావు, దేవాలయ కమిటీ అధ్యక్షులు పి.జగన్నాథం, ముఖ్య ఉపాధ్యక్షురాలు బాలమణి, ప్రధాన కార్యదర్శి డి.రమేష్, ట్రెజరర్ దయానంద్, ఉపాధ్యక్షులు మరియు ఆలయ ధర్మకర్త ఓంకార్ రెడ్డి, మహేందర్ గుప్తా, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పి.కవిత, వి.జ్ఞానేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఉచిత కార్పొరేట్ వైద్య సేవలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**టీ మీడియా,మార్చి 16,పెద్దపల్లి :**



సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో ఆదివారం రోజున జె.ఎస్.ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సుమన్ గ్యాస్ట్రో లివర్ అండ్ కిడ్నీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కరీంనగర్ వైద్య బృందం డాక్టర్లు రాజేందర్ రెడ్డి,దివ్య రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్బంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు పట్టణంలో నివసించే వారికి వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఉచిత మెగా వైద్య శిభిరం ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో ఉన్న ప్రజల వివిధ రకాల వ్యాధులను గుర్తించి ఉచితంగా చికిత్సలు నిర్వహించడంతో పాటు మందులు అందించడం గొప్ప సంకల్పం అన్నారు. గ్రామాలలో నివసించే వారు తమ శరీరంలో ఉన్న రుగ్మతలను గుర్తుపట్టారని తీరా సమయానికి ఆస్పత్రిలోకి వెళితే లక్షలలో ఫీజులు చెల్లించాల్సి వస్తుందని ముందుగానే ఇలాంటి శిబిరాల ద్వారా తమ రుగ్మతలను తెలుసుకొని జాగ్రత్తలు పడడం మంచి పరిణామం అన్నారు. వివిధ సందర్భాలలో ప్రజలకు వచ్చే వ్యాధులను గుర్తించకుండా కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని ముందుగానే ఇలాంటి క్యాంపుల ద్వారా తమ రుగ్మతలను తెలుసుకొని చికిత్సలు పొందాలని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలను ప్రజలకు అందించే విధంగా అన్ని రకాల వైద్యులను తీసుకొని వచ్చి త్వరలోనే సుల్తానాబాద్ లో ఐల రమేష్ ఆధ్వర్యంలో మెగా క్యాంపు నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు ని ఆసుపత్రి వర్గాలు ఘనంగా సన్మానించారు. ఈ శిభిరంలో దాదాపు 500 మందికి,ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రేవంత్, షుగర్,బీపీ,పరీక్షలు చేపట్టి రోగ నిర్ధారణ చేసి రిపోర్టును అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్,మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, అబ్బయ్య గౌడ్,చిలుక సతీష్,జెఎస్ఆర్ ఆస్పత్రి వర్గాలు మహేందర్ రెడ్డి, రమణా రెడ్డి,కుమార్,వేని శెట్టి రాము,రమాకాంత్, మేరీ,స్వప్న,మానస, కాంగ్రెస్ పార్టీ, నాయకులు,కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## వార్షిక లక్ష్యాన్ని సాధించిన కార్మికులకు, అధికారులకు అభినందనలు

- ఏఐటియుసి నాయకులు

**టీ మీడియా,మార్చి 16,గోదావరిఖని :**



ఓసిపి 5 లో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన కార్మికులకు, అధికారులకు ఆదివారం అభినందనలు తెలిపిన ఏఐటియుసి నాయకులు,సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె ఓసిపి 5 లో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 36 లక్షల టన్నులను పదిహేను రోజుల ముందుగానే సాధించిన సందర్భంగా ఓసిపి 5 లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు, పర్మనెంట్ కార్మికులకు, అధికారులకు, సూపర్వైజర్లకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అభినందనలు తెలుపుతుందని ఆ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి,బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోశం,బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్,ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్,ఓసీపీ5 ఫిట్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ఓసిపి 5 ప్రాజెక్టు ఆఫీసర్ చంద్రశేఖర్,ఎస్ ఓ యం రమేష్ బాబు,గని మేనేజర్ అనిల్ గబాలే లకు ప్రత్యేక ధన్యావాదాలు వారు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. అదేవిధంగా పదిహే ను రోజుల ముందుగానే యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన ఓసిపి 5 కార్మికులకు ప్రత్యేక బహుమతి ఇచ్చె విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ధ్వజస్తంభం జీవ ప్రతిష్ట

**టి మీడియా, మార్చి 16, పినపాక ప్రతినిధి :**

అశ్వాపురం మండల పరిధిలోని గొందిగూడెంలో వెలసిన శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ నారాయణ స్వరూప శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం యంత్ర సహిత జీవ ధ్వజస్తంభం ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. 2000వ సంవత్సరంలో, ఆనాటి బూర్గంపాడు ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య దొర, గ్రామ సర్పంచ్ పాయం జోగయ్య ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్మించారు. అప్పుడు ధ్వజస్తంభానికి నార యేపి చెట్టును ఉపయోగించగా, ఈ సంవత్సరం జూలై మాసంలో కురిసిన భారీ వర్షాలకు ధ్వజ స్తంభం పడిపోయింది. గొందిగూడెం మాజీ సర్పంచ్ పాయం భద్రమ్మ- సర్వేశ్వరరావు దంపతులు, తమ వంతు చందాగా లక్ష రూపాయలు ఇచ్చి, గ్రామస్తుల సహాయ, సహకారాలతో, నల్లరాతి తో చేసిన ధ్వజస్తంభాన్ని కొనుగోలు చేసి,విజయవాడకు చెందిన రామానుజం శాస్త్రి, బృందం వేద పండితుల మంత్రోచ్ఛారణలతో, శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని అశ్వాపురం కు చెందిన గ్రామీణ వైద్యులు పసుపులేటి నాగేశ్వరరావు- వజ్రమ్మ దంపతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి



## వార్షికోత్సవ ఉత్సవాలలో పాల్గొన్న రూరల్ ఎస్ఐ

**టీ మీడియా, మార్చి 16, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రంలోని బందార్ నగర్ కాలనీలో గల హృద్య ఇన్స్టిట్యూట్ వార్షికోత్సవ ఉత్సవాలలో వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ పోటీ ప్రపంచంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు అంటే భయపడకుండా చదువు అంటే కష్టంతో కాదు ఇష్టంతో చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు దిశ నిర్దేశిస్తూ ప్రత్యక్షంగా తను అనుసరించిన విధి విధానాలను వారి పూర్తి అనుభవాలను విద్యార్థులకు క్లుప్తంగా వివరిస్తూ ఒక ప్రణాళిక బద్ధంగా ముందు కెళ్లాలని సూచించడం జరిగింది. ప్రత్యేకంగా వనపర్తి చుట్టుపక్కల చిన్నచిన్న గ్రామాల విద్యార్థిని విద్యార్థులకు కూడా తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను బోధన కల్పిస్తున్నందుకు ఇన్స్టిట్యూట్ యాజమాన్యం హేమెందర్ ని అభినందించారు. అనంతరం ఎస్ఐ ని యాజమాన్యం శాలువ తో ఘనంగా సన్మానించారు. వార్షికోత్సవాలకు హాజరై వారి విలువైన సూచనలను అందించినందుకు విద్యార్థులు ఎస్ఐ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**టీ మీడియా, మార్చి 16, వనపర్తి బ్యూరో :**

గత వారం రోజుల క్రితం పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన అంజనమ్మ నివాసముంటున్న పూరి గుడిసె ప్రమాదవశాత్తు పూర్తిగా కాలిపోయింది. అదే రోజు ఫోన్లో బాధితులను పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం గ్రామానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించారు. బాధితురాలు అంజనమ్మకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని, అదేవిధంగా ప్రభుత్వపరమైన సహాయ సహకారాలు అందజేస్తామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. అనంతరం పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన గోవిందమ్మ వెంకటయ్యల కూతురు జ్యోతి ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి నూతన జంటను ఆశీర్వదించారు. అదే విధంగా చిన్న సౌదయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామానికి వెళ్లిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సౌదయ్య ఆరోగ్య పరిస్థితిని అడికి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు తను సహకరిస్తారని ఆయన కుటుంబానికి భరోసా కల్పించారు. పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన భీమయ్య ఈనెల 11వ తేదీన ప్రమాదవశత్తు మృతి చెందారు. తూడి మేఘారెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లిన సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ప్రభుత్వపరమైన సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమాల్లో మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, మణిగిల్ల తిరుపతిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, అమ్మపల్లి వెంకటేశ్వర రెడ్డి, వీరాయపల్లి వెంకటయ్య, అల్వాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిండు ప్రాణం పోయేవరకు ఇలాగే ఉంచుడా..?

**టీ మీడియా, మార్చి 16 ,మంథని :**



మంథని అంబేత్కర్ చౌక్ లో ఎన్నో నెలలుగా ఇలా క్లోజ్ చేయకుండా ఉన్నా మోరీ నాల అధికారులకు కనిపించడం లేదా ఎవరో ఒక పసి బిడ్డా ప్రాణమో లేక విద్యార్థి ప్రాణమో లేక యువతి యువకుల ప్రా లేక సీనియర్ సిటిజన్ లా ప్రాణమో పోయేదాకా దానికి మోక్షం ఉండదా. ఏదైనా జరగరానిది జరిగితే ఆ నష్టపోయిన కుటుంబానికి న్యాయం చేయగలమా దానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు ?అందుకే ఎలాంటి దుర్ఘటన జరగక ముందు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తక్షణమే పనులు చేపట్టి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరడం జరుగుతుంది.

# యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

**టీ మీడియా, మార్చి 16, వనపర్తి బ్యూరో :**




తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడంతో నిరసన చేస్తామని తెలపడం జరిగింది. వనపర్తి పట్టణ అవోపా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 124 వ జయంతి కార్యక్రమం పొట్టి శ్రీరాములు చౌకు నందు పొట్టి శ్రీరాములు విగ్రహం కు పూలమాలలతో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కలకొండ శ్రీనివాసులు, కోశాధికారి సంబు వెంకటరమణ, వివిఎస్ఎన్ ప్రసాదరావు, కటకం శ్రీధర్, సునీల్, పరమేష్, సురేష్ బాబు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని కన్వీనర్ పూరి బాలరాజు, బచ్చురాము దాచ శివ సంతోష్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రావడం పొట్టి శ్రీరాములు ఆశీస్సులతో ఆనాడు తమిళ రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను పోరాడి అమరణ నిరాహార దీక్షతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన ఆర్యవైశ్య ముద్దుబిడ్డ పొట్టి శ్రీరాములు అదే స్ఫూర్తితో మనం ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్లో ఉండి ఈ రోజు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నం అంటే ఆర్యవైశ్యులు ప్రత్యేకంగా పాల్గొని రాష్ట్రాన్ని సాధించుకున్నాం. మరి ఆన ఆశయాలను సాధించాలంటే ప్రతి ఒక్కరం ఆయన యొక్క దారిలో ఆయన యొక్క స్ఫూర్తిలో నడవాలని పిలుపునివ్వడం జరిగింది. మరి ఈరోజు ఈ ఆంధ్రప్రదేశ్ ఏరుపడ్డ రాష్ట్రంలో ఉమ్మడి రాష్ట్రంలోనే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ అప్పటి ముఖ్యమంత్రి పేరు పెట్టడం జరిగింది. కానీ నిన్న మొన్న వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారు తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించి తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టడం ఎంతవరకు న్యాయం మరి ఈ విధంగా ఆర్యవైశ్యులను కించపరచడమే కదా ? ఆర్య వైశ్యులు భారతదేశంలోని పేరుగాంచిన వైశ్యులని పిలుస్తుంటారు మరి ఈ విధంగా తెలంగాణ రాష్ట్ర సీఎం ముఖ్యమంత్రి రెడ్డి మా యొక్క ఆర్యవైశ్య తరపు నుండి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం చాలా బాధాకరంగా ఉన్నదని ఆర్యవైశ్యులు భావిస్తున్నారు. కాబట్టి పేరును కొనసాగించుకుంటూ ఇంకో యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాల్సిందిగా కోరారు. లేనియెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు ఉద్యమంలో పాల్గొంటారని చేస్తారని పిలుపునివ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో వనపర్తి ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొనడం జరిగింది.



## ఎమ్మెల్యే జదీశ్వర్ రెడ్డీ దిష్టి బొమ్మ దగ్ధం

**టీ ఐడియా, మార్చి 16, మంథని:**

పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం. ముత్తారం మండలం రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు శ్రీ దుదిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధంఅసెంబ్లీ సమావేశాలలో భాగంగా పవిత్ర దేవాలయంగా భావించి రాష్ట్ర ప్రజల కోసం వారి అవసరాల కోసం చట్టాలు తయారు చేసే పవిత్రమైన దేవాలయంగా నిండు శాసనసభలో గౌరవ సభ అధిపతి దళిత జాతి ముద్దుబిడ్డ గడ్డం ప్రసాద్ అగౌరపరిచే విధంగా మాట్లాడినటువంటి వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక ప్రధాన చౌరస్తాలో బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను, మరియు కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీగారి ఆధ్వర్యంలో జరిగినది ఈ సందర్భంగా ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ, మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మద్దె లరాజయ్య మాట్లాడుతూ దళిత బిడ్డ స్పీకర్గా మాట్లాడటానికి జీర్ణించుకోలేకపోతున్నారు. కనుక అందుకే స్పీకర్ను టార్గెట్ చేశారని మొదటి నుండి బి ఆర్ ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని చెప్పడం జరిగింది దళిత హక్కులను బడుగు బలహీన వర్గాల హక్కులను వారిని కాపాడుకోవడం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని చెప్పారు నలగొండ శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ గ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేకపోతే తన శాసనసభ సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు గాదం .శ్రీనివాస్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, బొల్లనేని బుచ్చం రావు ,బక్కతట్ల కుమార్, తాటిపాముల శంకర్, అలగం సంపత్, బాలసాని రాజకుమార్ ,చందు, గుడికొండల్ రెడ్డి ,అకోజ్ అశోక్ ,ఓడేదు గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి చంద్రమౌళి. మరియు సింగరమైన సదయ్య ముత్తారం మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కతట్ల వినీత్ ముత్తారం ఎస్సి సెల్ శేఖర్, పెగడ రాజేంద ,రాకేష్. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తల రాతను మార్చేది చదువు ఒక్కటే

- 1-టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి

**టీ మీడియా,మార్చి 16,గోదావరిఖని :**




రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో రామగుండం మండల స్థాయి టాలెంట్ టెస్ట్ ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా గోదావరిఖని 1- టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం హాజరైనారు. ఈ సందర్భంగా గోదావరిఖని 1- టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ...తలరాతను మార్చేది చదువు ఒకటేనని,చదువును మించిన ఆయుధం వేరొకటి లేదని,నిత్యం పుస్తకాలను నెమరేసుకోవాలని,చెడు అలవాట్లను విడనాడి, క్రమశిక్షణగా మెదలాలని, ఆయన విద్యార్థులకు సందేశామిచ్చారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ... విద్యార్థుల్లో పోటీ తత్వంతో పాటు సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఈ టాలెంట్ టెస్ట్ ప్రతిఏటా నిర్వహించడం జరుగుతుందని,అదేవిధంగా వచ్చే బోర్డు ఎగ్జామ్స్ కు ముందస్తుగా ఇదొక ప్రాక్టీస్ గా విద్యార్థులకు ఉపయోగపడుతుందని, పదవ తరగతి పరీక్షలు జీవితంలో పునాది లాంటిదని,పునాది గట్టిగా ఉంటేనే ఇల్లు గట్టిగా ఉంటదని,అదేవిధంగా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే, భవిష్యత్తులో మరెన్నో అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని అని ఆయన అన్నారు. ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి, సహకరించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, పరీక్ష కేంద్రాన్ని కేటాయించి సహకరించిన కాకతీయ జూనియర్ కళాశాల యాజమాన్యానికి హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్,ధనాల ఉదయ్,మిట్టపల్లి రిత్విక్,ఎల్కపల్లి వెంకటసాయి,సాయి అనుప్,నల్ల అచ్చుతన్ తదితరులు పాల్గొన్నారు.

# స్టానిటరీ ఇన్స్పెక్టర్ ను సస్పెండ్ చేయాలి

- దళితుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తన

**టీ మీడియా, మార్చి 16, వనపర్తి బ్యూరో :**





రెక్క ఆడితే కానీ డొక్క నిండని చెప్పులు కుట్టి జీవించే దళితులపై మున్సిపల్ అధికారుల ప్రతాపం ఆపాలి. వనపర్తి పట్టణం షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట షెడ్లు నిర్మించుకొని చెప్పులు కుట్టి జీవించే చర్మ కారులపై మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ సిబ్బంది ప్రతాపం చూపించడం ఇంతవరకు సమంజసం .శనివారం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద, మున్సిపల్ సిబ్బంది కూల్చి వేసిన చర్మకారుల షెడ్డును, బండలను తొలగించారు. డ్రైనేజీ పై చెప్పులు కుట్టే దళితులు ఎన్నో ఏళ్ల క్రితం నుండి తడికల షెడ్డు వేసుకొని చెప్పులు కుట్టి బతుకుతున్నారు . డ్రైనేజీ మురుగు తీసేందుకు షెడ్లు అడ్డంగా ఉన్నాయనే నెపంతో సానిటరీ ఇన్స్పెక్టర్ వాటిని ధ్వంసం చేశారు. షెడ్లను తొలగించ కుండనే డ్రైనేజీని శుభ్రం చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా చెప్పులు కుట్టే దళితులను అక్కడి నుంచి పంపేయాలన్న దురుద్దేశమే అధికారులలో కనిపిస్తోంది. షెడ్లను తొలగిస్తే చెప్పులు కుట్టే దళితుల బతుకులు రోడ్డున పడతాయి. అంబేద్కర్ చౌక్ రోడ్డు, రాజీవ్ చౌక్, కొత్త బస్టాండ్, జూనియర్ కాలేజ్ రోడ్డు, వివేకానంద చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన పెద్ద పెద్ద ఇల్లు షాపులు నిర్మించుకున్న వారు డ్రైనేజీలను ఆక్రమించి మెట్లు నిర్మించారన్నారు. డ్రైనేజీలపై నిర్మించిన మెట్లను తొలగించమని మున్సిపల్ అధికారులు ఎందుకు అడగడం లేదన్నారు. అధికారులు నిద్రపోతున్నారా? కనిపించడం లేదా?డ్రైనేజీలపై మెట్లు నిర్మించడం తో చెత్త చెదారం డ్రైనేజీల్లో పేరుకుపోయి రోడ్లపై వెళ్లే వారికి కంపు కొడుతోందన్నారు. డ్రైనేజీలు ఆక్రమించి మెట్లు నిర్మించిన వారు సంపన్నులు కావడంతో మెట్లు తీయమని అడిగే దమ్ము , ధైర్యం మున్సిపల్ అధికారి అయిన శానిటరీ ఇన్స్పెక్టర్ కు లేదన్నారు. చెప్పులు కుట్టేవారు పేదవారి కావడంతో వారిపైన నా బలం ప్రయోగిస్తే బాగుంటుందని డ్రైనేజీ పై షెడ్డు తీయమని వేధిస్తున్నాడు. అంత బలం ఉంటే ముందుగా డ్రైనేజీలపై నిర్మించిన సంపన్నుల ఇండ్లు, షాపుల మెట్లను తొలగించి, తర్వాత మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద చెప్పులు కుట్టే వారి షడ్ల వద్ద గల డ్రైనేజీ జోలికి రావాలి. అంతవరకు దళితుల షెడ్లు తీయమని కోరే నైతికత సానిటరీ ఇన్స్పెక్టర్ మున్సిపల్ అధికారులకు లేదు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా బహిరంగ ప్రదేశాలలో దళితుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన శానిటరీ ఇన్స్పెక్టర్ ను తక్షణమే సస్పెండ్ చేయాలి.

## అత్త, అల్లుడు వివాహేతర సంబంధం

**- భర్త చూశాడని అడ్డు తొలగించారు**



**టి మీడియా, మార్చి 16, జడ్చర్ల :** వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్య ప్రియుడుతో కలిసి భర్తను హత్య చేసింది. పూర్తి వివరాల్లోకి వెళితే వరుసకు అల్లుడు అయిన వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని భర్తకు దొరికి పోవడంతో అతన్ని హత్య చేసింది. ఆపై అనుమానం లేకుండా కథ ముగించాలని అనుకున్నది కానీ మృతుని అన్న కొడుకు ఫిర్యాదుతో కటకటాల పాలైంది. ఈ ఘటన మహబూబ్ నగర్ జిల్లాలో చోటు చేసుకుంది.జిల్లాలోని జడ్చర్ల పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మీనగా కోటయ్యకు మేనకోడలు అయిన అలివేలుతో 20 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరి సంసారం ఇన్నాళ్లు సాఫీగా కొనసాగుతూ వచ్చింది. వీరి దాంపత్యానికి గుర్తుగా ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కానీ కొంత కాలంగా అదే కాలనీలో రాజీవ్ అనే యువకుడు నివాసం ఉంటున్నాడు. అలివేలుకు వరుసకు అల్లుడు అవుతాడు. వీరి పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త భార్యను మందలించి వదిలేశాడు.కానీ వారిద్దరి ప్రవర్తనలో మార్పు రాలేదు. జనవరి నెలలో ఇద్దరు రాత్రి ఏకాంతంగా ఇంట్లో ఉన్న సమయంలో భర్త కోటయ్య చూశాడు. ఈ విషయం ఎవరితోనైనా చెప్తాడని అనుకున్న భార్య అలివేలు, అల్లుడు రాజీవ్?తో కలిసి గొంతుకు చున్ని చుట్టి హత్య చేశారు. విషయం బయటికి రాకుండా ఉండేందుకు ఉదయాన్నే లేచి భర్త నిద్రలోనే మృతి చెందాడని అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. కానీ మృతుడి అన్న కుమారుడు నాగయ్య తన పెదనాన్న కోటయ్య మరణంపై అనుమానం వ్యక్తం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కమలాకర్ విచారణ చేపట్టాడు. మృతుడు భార్య అలివేలును విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకోవడంతో నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

**-ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**టి మీడియా, మార్చి 16, పినపాక ప్రతినిధి:**పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకని,పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.మణుగూరు పట్టణంలోని చేపల మార్కెట్ ఏరియాలోని కుతుబ్ మసీద్ ఆవరణలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సామూహిక నమాజ్ ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ముస్లిం సోదర సోదరీమణులందరూ తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉపవాస దీక్షలో పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**-చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



**టీ మీడియా, మార్చి 16,వేడ్చల్:**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఇటీవలే అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన కొట్టె రామాంజనేయులు కి 40,000/-, నునవత్ శంకర్ కి 40,000/-ల సీఎంఆర్ఆఫ్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు సీఎం సహాయనిధి ఎంతో మేలు చేస్తుందన్నారు.బడుగు,బలహీన ఆశాజ్యోతి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అని కొనియడారు.ప్రజా సంక్షేమమే మా కాంగ్రెస్ పార్టీ లక్ష్య సాధన అన్నారు.మన ఇంచార్జ్ మంత్రివర్యులు శ్రీ శ్రీధర్ బాబు గారి ప్రత్యేక చొరువతోమన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు అవుతున్నాయి అన్నారు.ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, అరుణ్, ఆంజనేయులు, శంకర్ గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలకు కొత్తగూడెం కు ఆహ్వానం



**టీ మీడియా,మార్చి16,భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:**కొత్తగూడెంలో ఈనెల 23 న కొత్తగూడెం క్లబ్లో, ప్రకృతి ఆరోగ్య మహాసభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా,సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ (పర్సనల్), వెల్ఫేర్(ఐఆర్ అండ్ పిఎం) కవిత నాయుడు,కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రహమాన్ లను నిర్వాహకులు కలిసి,మొక్కలను అందించి అతిధులుగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ రిటైర్డ్ జనరల్ మేనేజర్ శనగ వెంకటేశ్వరరావు, మహాసభల కో ఆర్డినేటర్ జి సుగుణారావు, కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, బంగారి శంకర్, దయానంద సాగర్ లు పాల్గొన్నారు.



## మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**ఽదాదాపు ఐదువేల మందికి టెస్టులు, మెడిసిన్**

**టీ మీడియా, మార్చి 16, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా గోపాల్పేట మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డాక్టర్ స్వర్గీయ జిల్లెల మాధవరెడ్డి జ్ఞాపకార్థంగా వనపర్తి నియోజకవర్గ యువనాయకుడు,కాంగ్రెస్ పార్టీ నేషనల్ హెడ్ హెల్త్ ప్రొఫెషనల్ అధ్యక్షుడు, డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ఆర్గనైజర్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గోపాల్పేట, రేవల్లి మండలాలతోపాటు వనపర్తి నియోజకవర్గం నుండి దాదాపు 5,000 మంది ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని హెల్త్ చెకప్ లు, ఉచిత మెడిసిన్స్ తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొని జిల్లెల మాధవరెడ్డి మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది.వైద్య శిబిరంలో డాక్టర్ జిల్లెల మాధవ రెడ్డి చిత్రపటానికి తన కూతురు డాక్టర్ శిల్పా రెడ్డి పూలమాలవేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా చిన్నా రెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తిని నమ్ముకొని ప్రజలకు వైద్య సేవ చేస్తూ మాధవరెడ్డి పేరు, ప్రతిష్టలు సంపాదించారని వారు గుర్తు చేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి డాక్టర్ జిల్లెల మాధవరెడ్డి పేరు, ప్రతిష్టలను గుర్తించి వనపర్తి నియోజకవర్గం లోని కాశీం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ కు డాక్టర్ జిల్లెల మాధవ రెడ్డి పేరు పెట్టడం ఎంతో సంతోషకరమైన విషయం అని వారు హర్షం వ్యక్తం చేశారు. పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. నేడు డాక్టర్ స్వర్గీయ మాధవ రెడ్డి జ్ఞాపకార్థం మెగా ఉచిత వైద్య శిబిరానికి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లెల ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ పేదలకు అండగా మా పెదనాన్న గారైన డాక్టర్ స్వర్గీయ జిల్లెల మాధవరెడ్డి వైద్యం నిర్వహించేవారు వారి గుర్తుగా పేదలకు వైద్యం అందించాలని తపనతో నేడు డాక్టర్ స్వర్గీయ జిల్లెల మాధవరెడ్డి జ్ఞాపకార్థంగా హెల్త్ చెకప్ లు, మెడిసిన్సు అందజేయడం జరిగిందని వారు తెలిపారు. ఇక ముందు కూడా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తానని మా పెద్దనాన్న తీరుగా వైద్యవృత్తితో పేద ప్రజలకు అండగా ఉంటానని అన్నారు.ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన డాక్టర్లకు శాలువలతో సన్మానించి షీల్డ్ లు అందజేశారు.ఉచిత వైద్య శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన డాక్టర్లకి , పోలీస్ సిబ్బందికి. ఎన్ సి సి విద్యార్థులకు, వైద్య సిబ్బందికి, వాలంటీర్లకి, ఆశా వర్కర్లకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# భారీగా తగ్గిన రక్త నిల్వలు

**చేతివాటం ప్రదర్శిస్తున్న బ్యాంకుల నిర్వాహకులు**

**ఇబ్బంది పడుతున్న అత్యవసర బాధితులు**












**టీ మీడియా, మార్చి 16, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా వైద్యశాలలోని రక్తనిధి కేంద్రంలో రక్తం నిల్వలు భారీగా తగ్గాయి. ఆదివారం ఖాళీగా దర్శనమిస్తున్న రక్త నిల్వ పట్టిక బోర్డు. గత పదిహేను రోజులుగా ఖాళీగా దర్శనమిస్తున్న బోర్డు. ప్రభుత్వ ఎండాకాలం ప్రారంభం నుంచి దాతలెవరూ ముందుకు రాక పోవడంతో నిల్వశాతం భారీగా తగ్గింది. రక్తం సేకరణ పూర్తిగా పడిపోయింది. దీంతో రోగులు, అత్యవసర బాధితులు ఇబ్బంది పడుతున్నారు. వనపర్తి జిల్లాలోని 15 మండలాలతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి రోజూ పెద్ద సంఖ్యలో రోగులు వైద్యం కోసం జిల్లా వైద్యశాలకు వస్తుంటారు. రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులకు అత్యవసరంగా రక్తం ఎక్కించి శస్త్ర చికిత్స లేదా వైద్యం అందించాల్సి ఉంది. ఆ సమయంలో బ్లడ్ బ్యాంకులో రక్తం అందు బాటులో లేకపోవడంతో ప్రైవేటు రక్తనిధి కేంద్రానికి పరుగులు తీయడం లేదా బాధితులను హైదరాబాద్, కర్నూల్, మహబూబ్ నగర్ ఆస్పత్రులకు రెఫర్ చేయాల్సి ఉంది. దీంతో సీరియస్ కేసులు మార్గమధ్యంలో మృత్యువాతపడిన సందర్భాలున్నాయి. ఇక ప్రసవాల కేసుల్లో ఎక్కువశాతం రక్తహీనత గర్భిణులు ఉన్నారు. వీరికి తప్పనిసరిగా రక్తం ఎక్కించి ప్రసవం, సిజేరియన్ చేయాల్సి ఉంది. ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయడంతో గతంలో చాలా వరకు కేసులు మృత్యువాతపడ్డాయి. ఈ నేపథ్యంలో బ్లడ్ బ్యాంక్కు రక్తం సమకూరడం లేదు.

**రక్తంతో చేతివాటం**

**ప్రదర్శిస్తున్న నిర్వాహకులు**

అసలే కలికాలం అడుగడుగునా దగానే. నెత్తురు కళ్లజూసే క్రిమినల్స్ నిర్వాకాలు ఎన్నెన్నో. వాళ్లను మించి నెత్తురు కూడు రుచి మరిగిన బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు ఉన్నారు. ప్రాణ దాతలను అందుకోవాల్సింది పోయి.రక్తంతో బిజినెస్ చేస్తున్నారు. వనపర్తి బ్లడ్ బ్యాంక్ లో రక్తం ఉన్న బోర్డు పైన రక్తం నిల్వలు లేవు అయిపోయాయి అని చెప్పి వేరే వారికి డబ్బులకు అమ్ముకుంటున్నారని. గత కొద్ది రోజులుగా బాధితులు వాపోతున్నారు. గట్టిగా అడుగుతే ఉన్న కూడా అవి వేరే వారు బుక్ చేసుకున్నారని చెబుతున్నారు. వేరే వారి పేర్లు చీటీ రాసి చూపిస్తున్నారు అని బాధితులు కొందరు వాపోతున్నారు.

**దాతలు స్వచ్ఛంద సంస్థలు స్పందించాలి**

రక్త నిల్వలు సమకూరేందుకు యువత, రాజకీయ పార్టీ నేతలు, సినీ హీరో అభిమానులు, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటారు. వచ్చేది వేసవి కాలం కావడంతో విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి. రక్తం కొరత నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్లో రక్తదాన శిబిరాలను నిర్వహించాలి.యువత, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యులు కోరుతున్నారు. రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలి. పోలీసు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, వివిధ సంఘాలు, విద్యార్థులచే క్యాంప్లను ఏర్పాటు చేసి బ్లడ్ను సేకరించాలి. రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడిన వారు అవుతారు.

## జాతియజెండా ఎగరేసిన ధీరుడు కే.ఎల్. నరసింహారావు

**-సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు.**



**టీ మీడియా,మార్చి16,భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:**పదిహేనేళ్లకే క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా స్కూల్ భవనం పై జాతీయ జెండా ఎగరేసిన ధీరుడు కే.ఎల్ నరసింహరావు అని సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు.స్థానిక మంచికంటి భవన్ లో కే ఎల్ నరసింహరావు వర్ధంతి కార్యక్రమం జరిగింది.ముందుగా కే ఎల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో పాల్గొని చిన్న వయసులోనే తన దేశభక్తిని చాటుకున్నాడని తెలియజేశారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని దళాలకు ఆయుధాలు సమీకరించే పని చేపట్టి ఇల్లందు ప్రాంతంలో భూస్వాములను గడగడలాడించడంలో కేఎల్ నరసింహారావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు.ఇల్లందు ప్రాంతానికి మొట్టమొదటి ఎమ్మెల్యేగా అది కూడా కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి మూడు పర్యాయాలు ఇల్లందు ఎమ్మెల్యేగా పని చేశాడని,ఈ కాలంలో ఇల్లందుని అభివృద్ధి చేయడంలో ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచాడని కొనియాడారు.భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా రైతులకు మద్దతుగా బండి పట్టాల ఉద్యమం ప్రారంభించి రైతాంగానికి అండగా నిలిచారని అన్నారు. మద్రాస్ నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోతున్న సమయంలో రాష్ట్రానికి ఏమి పేరు పెట్టాలి అనే చర్చ జరుగుతున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ అని పేరును సూచించింది కేఎల్ అని ఆ పేరుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టడం కూడా జరిగిందని గుర్తు చేశారు. భూస్వామి కుటుంబంలో పుట్టినప్పటికీ నిరంతరం పేదలు కౌలు రైతులు కార్మిక వర్గం కోసమే కేఎల్ పరితపించేవాడని తన తుది శ్వాస వరకు వారి కోసమే పని చేశాడని గుర్తు చేశారు.దేశానికి ఎర్రజెండా మాత్రమే ప్రత్యామ్నాయమని నమ్మి చివరి వరకు ఎర్రజెండాను మూసిన ధీరుడు కే ఎల్ అని కొనియాడారు. నేడు పాలకు ప్రభుత్వాలు పేదలు రైతాంగం పై విధిస్తున్న పన్నుల భారానికి వ్యతిరేకంగా ప్రజల తరపున పోరాడటమే కేఎల్ కి ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య,ఏజె రమేష్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. బ్రహ్మాచారి,లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, యాస నరేష్ నాయకులు తులసీరామ్, సందకూరు లక్ష్మి,ఊపేష్, రాజారావు,నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రమ దోపిడికి గురి చేస్తున్నప్రభుత్వాలు

**ఏఐటీయూసీరాష్ట్ర సహాయ కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి**




**టీ మీడియా,మార్చి16,భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** మార్చి 15 ,16 తేదీల్లో నాగపూర్ లో జరిగిన ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ మిడ్ డే మీల్స్(ఏఐటీయూసీ) జాతీయ జనరల్ కౌన్సిల్ మీటింగ్ మిడ్ డే మిల్స్ నేషనల్ ప్రెసిడెంట్ శ్యాము కాళీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మధ్యాహ్నం భోజన కార్మికులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడికి గురి చేస్తున్నాయని సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరి చేస్తున్నారని రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు సంఘటితమై పోరాటం చేయాలని తెలిపినారు. ఈ సమావేశానికి మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జాతీయ రాష్ట్ర కమిటీ నాయకులు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్,రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్ ,వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## ఏఐటియుసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

**-బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు.**



**టీ మీడియా,మార్చి16,భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు రిలే నిరాహార దీక్షలు మార్చి 19,2025 నుండి మార్చి 22,2025 వరకు జరగనున్నాయని తెలిపిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వట్టికొండ మల్లికార్జునరావు.కార్యక్రమం వివరములు 1. 19 -3 -25 ఉదయం జీకే ఓ సి మరియు జెవిఆర్ఓసి ఏఐటియుసి డెలిగేట్స్ తో దీక్ష. 2. 20 -3 -2025 ఉదయం పివికే గనులు మరియు జెబిఆర్ఓసి సిహెచ్ పి డెలిగేట్స్ తో దీక్ష.3. 21 -3 -25 ఉదయం ఏరియా వర్క్షాప్ ఆర్ సి హెచ్ పి మరియు కిష్టారం ఓసి డెలిగేట్స్ తో దీక్ష.4. 22 -3 -2025 కొత్తగూడెం ఏరియా అన్ని డిపార్ట్మెంట్స్ మరియు సత్తుపల్లి జేవిఆర్ఓ సీటు ఆఫీస్ బ్యాలెన్స్ దీక్ష కలదు. ప్రైవేటీకారణకు వ్యతిరేకంగా జరుగు దీక్ష కార్యక్రమము జయప్రదం చేయవలసిందిగా వారు కార్మికులను కోరారు.

## దిగ్విజయంగా ముగిసిన కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు**

**టీ మీడియా,మార్చి16,భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:**సామర్థ్యంలో ఆడపిల్లలకు అత్యంత అవసరంగా మారిన కరాట వారి ఆత్మ రక్షణకు ఎంతో దోహద పడుతుందని కరాట నేర్చుకున్న వారిలో మనోధైర్యం ఎక్కువగా పెరుగుతుందని టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు తెలిపారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉర్దుగర్ వేదికగా నిర్వహించిన రెండు రాష్ట్రాల కరాటే ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారం అత్యంత ఘనంగా ముగిశాయి. బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు మాట్లాడుతూ కరాటే ప్రాధాన్యత పెంచేందుకు టైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగిలి ఆధ్వర్యంలో జరుగుతున్న 15వ ద్విరాష్ట్ర కరాటే పోటీల్లో సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొనడం ఎంతో శుభ పరిమాణం అన్నారు. దూర ప్రాంతానికి వచ్చిన క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయాన్ని కలగజేయటమే కాకుండా ఎలాంటి ఇబ్బంది జరగకుండా మౌలిక సదుపాయాలను సమకూర్చటం ఆనందం ఇచ్చిందన్నారు. రెండు రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొని ఈ పోటీలను దిగ్విజయం చేయడం తెలంగాణ రాష్ట్రానికి వన్నెతెచ్చిందన్నారు. దూర ప్రాంతాల నుంచి క్రీడాకారులను తీసుకొచ్చేందుకు సంబంధిత కరాటే మాస్టర్లు తీసుకున్న చొరవ ఎంతో అభినందనీయమని అన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లతో పాటు వ్యక్తిగత మెమొంట్స్ మెడల్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నాగా సీతారాములు శాలువాతో సన్మానించి సత్కరించారు.



## ముత్యాల లక్ష్మి నారాయణమ్మ మృతి

**-మాజీ ఎంపీ నామ సంతాపంలి**



**టీ మీడియా, మార్చి 16, ఖమ్మం:**మాజీ మంత్రివర్యులు వనమా వెంకటేశ్వరరావు సోదరీమణి మరియు ముత్యాల వీరభద్రం, ముత్యాల రమణమూర్తి ల మాతృమూర్తి ముత్యాల లక్ష్మి నారాయణమ్మ ఆదివారం ఉదయం పరమపదించారు. ఈ విషాద వార్తను తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ముత్యాల లక్ష్మి నారాయణమ్మ ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. అలాగే, వారి కుటుంబ నామ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## మంత్రి జూపల్లి పర్యటన

**టీ మీడియా, మార్చి 16, ఆత్మకూరు:** మక్తల్ నియోజకవర్గం ఊట్కూరు మండలం పులిమామిడి గ్రామంలో ఉన్న రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు దేవాలయానికి రోడ్డు సౌకర్యం కోరగా, అభివృద్ధిలో భాగంగా 10 లక్షల నిధులు మంజూరు చేస్తానని ఆయన అన్నారు. అనంతరం అమర్చింత మండలం చంద్ర ఘడ్ కోటను పర్యాటక కేంద్రంగా అబివృద్ధి చేస్తానని ఎంతో ప్రాచుర్యం పొందిందని,ముందుగా ఇక్కడికి పురావస్తు శాఖ అధికారుల పర్యవేక్షణ లో పరీక్షించి కోట చరిత్రను తెలుసుకోవని ఆదేశించారు.అలాగే చంద్ర ఘడ్ కోట పర్యాటక కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఇరవై అయిదు లక్షల రూపాయల నిధులను మంజూరు అయ్యేలా చేస్తాననీ అన్నారు. ఆత్మకూరు మండలంలోని శ్రీ శ్రీ స్వయంభు చర్ల పరమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి దేవాలయ అభివృద్ధికి 25 లక్షల నిధులు ఇస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి టిపిసిసి అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, ఆత్మకూరు మండల అధ్యక్షులు పరమేష్, టౌన్ ప్రెసిడెంట్ నల్గొండ శీను, సీనియర్ నాయకులు తులసిరాజ్, రేహమతుల్లా, గంగాధర్ చంద్రగట్టు రవి వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు



## డయాలసిస్ యూనిట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని

**టీ మీడియా,మార్చి16,భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి నందు ఈ మధ్యకాలంలోనే మొత్తం 10 డయాలసిస్ యూనిట్లను మంజూరు చేయించి ప్రారంభించిన స్థానిక కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం లో సుమారు 200 మంది డయాలసిస్ పేషెంట్లు డయాలసిస్ కోసం సదురా ప్రాంతాలకు వెళుతూ ప్రైవేటు ఆసుపత్రిలో వేల రూపాయలు ఖర్చు చేయవలసి వస్తుందని ఈ ప్రాంత ప్రజలకు మరియు జిల్లా ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఉండాలని ఆలోచన చేసి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రస్తుతం పాల్వంచకు 10 మరియు కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి 10 డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయించడం జరిగిందని వాటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు, అదనంగా మరో 5 డయాలసిస్ యూనిట్ల కోసం ప్రయత్నం చేస్తానని కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన సౌకర్యాల కోసం నా వంతు కృషి నేను చేస్తున్నానని ఇక్కడ పనిచేస్తున్నటువంటి డాక్టర్లు సిస్టర్స్ పారామెడికల్ సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, సూపర్డెంట్, మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా నుంచి అమ్మ రాగానే పెళ్లి



వయసు దాటిన వారే లక్ష్యంగా వల విసిరేవాడు. తన తల్లి అమెరికాలో వైద్యురాలని, తాను స్థానికంగా ఉంటూ వ్యాపారం చేస్తుంటానని, అమెరికా నుంచి అమ్మ రాగానే పెళ్లి చేసుకుందామంటూ నమ్మించేవాడు. ఇటీవల జూబ్లీహిల్స్?కు చెందిన ఒక వైద్యురాలికి మ్యాట్రిమోనీ వెబ్సైట్ ద్వారా నిందితుడు పరిచయమై, అత్యవసర ఖర్చులంటూ రూ.10.94లక్షలు తీసుకొని ముఖం చాటేశాడు. డబ్బు తిరిగి ఇవ్వమని అడిగితే నగ్న వీడియోలు తయారు చేయించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానంటూ బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈనెల 13న నిందితుడు బెంగళూరులో ఉన్నట్టు గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్?కు తరలించారు.

**ఓ శాసన సభ్యుడి ఫొటో డీపీగా పెట్టుకొని**

వంశీకృష్ణ బీటెక్ మధ్యలోనే ఆపేసి 2014 సంవత్సరంలో హైదరాబాద్ వచ్చాడు. ఆన్లైన్ గేమింగ్, బెట్టింగ్లకు అలవాటు పటి 2016 సంవత్సరంలోలో జాబ్ కన్సెల్టెన్సీలో చేరి యువకులను ఉద్యోగాల పేరిట మోసం చేసి అరెస్ట్? అయ్యాడు. జైలు నుంచి విడుదలై సోషల్ మీడియాలో ఆడవాళ్ల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి తన ఆదాయంలో అధిక శాతం సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నట్టు మహిళలు, యువతులను నమ్మించి, వారినీ భాగస్వామ్యం కావాలంటూ సుమారు వెయ్యి మంది నుంచి డబ్బు వసూలు చేశాడు. తరువాత యానాంలోని ఓ శాసన సభ్యుడి ఫొటో డీపీగా పెట్టుకొని ఉద్యోగ అవకాశాలు ఇప్పిస్తానంటూ50 మంది మహిళలు, యువతుల నుంచి రూ.2.50కోట్లు కాజేశాడు.